PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 171 | 25 శుక్రవారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

# భారీ వర్షాలు..

## జిల్లాల కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేసిన చంద్రబాబు



- వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు ఏ అధికారి కూడా అశ్రద్ధ వహించకూడదన్న చంద్రబాబు
- లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశం
- ఆహారం, మంచినీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్న సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సహాయక చర్యలు, ముందస్తు ప్రాణ నష్ట నివారణ చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.వాతావరణం పూర్తిగా అనుకూలించి వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఏ ఒక్క అధికారి కూడా అశ్రద్ధ వహి ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం సంభవింతులకు నాణ్యమైన ఆహారం, మంచినీరు, అత్యవసర వైద్య సదుపాయాలు మరియు మందులు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. అంతేకాకుండా, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టంపై కచ్చితమైన అంచనాలు రూపొందించి నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా నిలుస్తుందనే నమ్మకం కలిగించాలని కలెక్టర్లకు తేల్చి చెప్పారు.



## డేటా సెంటర్లకు ఏపీ కొత్త విధానం.. 70 శాతం గ్రీన్ ఎనర్జీ తప్పనిసరి: నారా లోకేశ్

- విశాఖలో డేటా సెంటర్ల కోసం పోలవరం జలాల వినియోగం
- ఏపీలో 23 రంగాల వారీగా ప్రత్యేక క్లస్టర్ల ఏర్పాటు
- అమరావతిలో క్వాంటం టెక్నాలజీ ఎకోసిస్టమ్ అభివృద్ధి
- 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం

రాష్ట్రంలో ఏర్పాటు చేసే డేటా సెంటర్లు పర్యావరణ హితంగా ఉండేలా సమగ్రమైన విధానాన్ని అనుసరిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

- స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిగా సిద్ధం కావాలన్న జగన్
- ఎన్నికలపై పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం
- ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని ఆదేశం

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు.



## కాంస్యం గెలిచిన భారత మెన్స్ బ్యాడ్మింటన్ జట్టుకు రాష్ట్రపతి



# అభినందనలు..!

ఆసియా క్రీడల లో కాంస్య పతకం గెలిచిన భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందనలు తెలియజేశారు. ఈ విజయం జట్టు దృఢ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. ఈ విజయం జట్టు పట్టుదల, పోరాట పటిమను ప్రతిబింబి స్తుందని పేర్కొన్నారు. జపాన్ లోని ఐచిలో బుధవారం జరిగిన సెమీ-ఫైనల్ మ్యాచ్ లో చైనా చేతిలో 3-1 తేడాతో ఓటమి చవిచూసినప్పటికీ, భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.ఈ క్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురుషుల బ్యాడ్మింటన్ జట్టుకు అభినందనలు తెలియజేశారు. ఆమె 'శ' వేదికగా స్పందిస్తూ.. 'ఆసియా క్రీడలలో కాంస్య పతకం సాధించిన భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టుకు హృదయపూర్వక అభినందనలు. ఈ

## ఎన్నికల సంఘం యాప్‌పై మరోసారి వివాదం.. ఓటు హక్కులు హరించివేస్తున్నారని శశి థరూర్ ఫైర్

- ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ECIచీవ్ సాఫ్ట్‌వేర్‌పై వివాదం
- పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల చేరిక అన్నీ ఎన్నికల ప్రధాన కమిషనర్ స్థాయిలోనే జరుగుతున్నాయని ఆరోపణలు
- పౌరుల ప్రాథమిక హక్కులు ప్రమాదంలో పడుతున్నాయన్న శశి థరూర్

ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ECIచీవ్ సాఫ్ట్‌వేర్‌పై మళ్లీ తీవ్ర వివాదం చెలరేగింది. కొత్త ఓటర్ల చేరిక, పేర్ల తొలగింపు వంటి నిర్ణయాలు ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్థాయిలోనే జరుగుతున్నాయని, మిగతా ఇద్దరు కమిషనర్లకు సమాచారం కూడా అందడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఆ సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గోవాలో జరిగిన ఘటనే ఈ వివాదానికి కారణం. ...మిగతా 2 లో...



## సీఎన్ఎన్, పాలిటికో జర్నలిస్టులకు వైట్‌హౌస్ ప్రవేశం పునరుద్ధరించాలి

- ట్రంప్ నిషేధాన్ని రద్దు చేసిన అమెరికా న్యాయమూర్తి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీఎన్ఎన్, ఎంఎస్ నౌ, పాలిటికో మీడియా సంస్థల జర్నలిస్టులకు వైట్‌హౌస్ ప్రవేశాన్ని నిషేధించిన నిర్ణయాన్ని ఫెడరల్ న్యాయమూర్తి తిప్పికొట్టారు. ఈ నిషేధం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ, వెంటనే ప్రెస్ పాసులు పునరుద్ధరించాలని ఆదేశించారు. యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి టిమ్ కెల్లీ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 18న ట్రంప్ ప్రకటించిన నిషేధాన్ని సవాలు చేస్తూ ఈ మూడు సం స్థలు దాఖలు చేసిన దావాలో ఈ తీర్పు వెలువడింది.

సీఎన్ఎన్, ఎంఎస్ నౌ, పాలిటికో సంస్థలు శ్వేతసౌధంలోకి రాకుండా ట్రంప్



# జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి.. తక్షణమే దిగిపోవాలి: రాహుల్ గాంధీ డిమాండ్..!

మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రమేయంతో దేశంలో 'ఓట్ల దొంగతనం' ( జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ ను ఆయన 'పరిరక్షకులే' కాపాడుతున్నారని మండిపడ్డారు. గురువారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, దేశంలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ మౌనంగా ఉండదని హెచ్చరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించి గత 10 నెలల్లో ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినా, వాటిని సీఈసీ పట్టించుకోలేదని వచ్చిన మీడియా కథనాలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఎన్నికల సంఘంలో ఈ అంతర్గత విభేదాలే తన ఆరోపణలకు బలమైన ఆధారమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "అబ్‌కీ బార్ 400 పార్" అని, దశాబ్దాల పాటు అధికారంలో ఉంటామని మోదీ, అమిత్ షాలు గతంలో ఎంతో ధీమాగా చెప్పారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యతిరేకత సర్వసాధారణమని, అలాంటిది బీజేపీకి మాత్రం ఎలా వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. "1971 యుద్ధంలో దేశానికి ఘన విజయం అందించిన ఇందిరా గాంధీ వంటి నేత కూడా ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో బీజేపీకి వ్యతిరేకంగా వ్యతిరేక పవనాలు ఉన్నా, అవి అకస్మాత్తుగా ఎలా మాయమయ్యాయి?" అని రాహుల్ నిలదీశారు. దీనికి కారణం 'ఓట్ల దొంగతనం' జరగడమేనని తమ పార్టీ ఒక నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు. "ఓట్లను దొంగిలిస్తే రాజ్యాంగానికి పునాదులే ఉండవు. దొంగిలించబడిన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు చేసే చట్టాలు కూడా చట్టవిరుద్ధమే అవుతాయి. దీనిని 'చట్టాల దొంగతనం' అంటారు. దాని ఫలితంగా సంస్థాగత మార్పులు కూడా అక్రమమే అవుతాయి" అని రాహుల్ వివరించారు. ఈ ప్రక్రియకు బాధ్యులైన మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను దేశద్రోహులుగా అభివర్ణించారు. గతంలో జరిగిన లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దీనిపై మోదీ, షాలపై భవిష్యత్తులో తప్పకుండా విచారణ జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ, "మీరు చేసింది దేశద్రోహంతో సమానం. ఇది రాజ్యాంగంపై, దేశ చట్టాలపై జరిగిన దాడి. ఓటును కాపాడాల్సిన మీరే ఇలా చేశారు. ఇప్పటికైనా రాజీనామా చేసి, దేశ ప్రయోజనాల దృష్ట్యా అప్రూవర్‌గా మారండి" అని హితవు పలికారు. నిజాయతీగా అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఇద్దరు కమిషనర్లను ఆయన అభినందించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దీనిని నిరూపించడానికి తమ వద్ద తగినంత సమాచారం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కుట్రకు బాధ్యులైన వారికి ఏదో ఒక రోజు తప్పకుండా శిక్ష పడుతుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం గతంలోనే స్పందించింది. కమిషనర్ల మధ్య చర్చలు, అభిప్రాయ భేదాలు పరిపాలనలో సాధారణ ప్రక్రియ అని, తుది నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని స్పష్టం చేసింది. అయినప్పటికీ, రాహుల్ చేసిన తాజా ఆరోపణలతో ఈ వివాదం మరింత ముదిరినట్టయింది.

# 145 కి.మీ రేంజ్‌తో హోండా క్యూసీ3 ఎలక్ట్రిక్ స్కూటర్.. ధర, ఫీచర్లు ఇవే!

**భారత మార్కెట్లోకి హోండా కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ విడుదల**

**రూ. 1.35 లక్షలుగా ప్రారంభ ధర నిర్ణయం**

**సింగిల్ చార్జ్‌తో 145 కిలోమీటర్ల రేంజ్ అందిస్తున్నట్లు వెల్లడి**

**కుటుంబాలు, పట్టణ ప్రయాణికులే లక్ష్యంగా తయారీ**

**తొలి దశలో ఢిల్లీ సహా ఐదు నగరాల్లో విక్రయాలు**



ప్రముఖ వాహన తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా భారత ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే దిశగా మరో ముందడుగు వేసింది. తన పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ, సరికొత్త 'హోండా క్యూసీ3' ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ. 1.35 లక్షలుగా (ఎక్స్-షోరూం) నిర్ణయించింది. హోండా నుంచి వస్తున్న మూడో ఎలక్ట్రిక్ స్కూటర్ ఇది. గతంలో యాక్టివా ఇ, క్యూసీ1 మోడళ్లను సంస్థ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ స్కూటర్ ప్రధానంగా రోజువారీ పట్టణ ప్రయాణాలు చేసేవారిని, కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని రూపొందించారు. సింగిల్ చార్జ్‌పై 145 కిలోమీటర్ల రేంజ్ అందిస్తుందని కంపెనీ ప్రకటించింది. ఇది హోండా యాక్టివా ఇ (102 కి.మీ) రేంజ్‌తో పోలిస్తే చాలా ఎక్కువ. ఇందులో 3.0 బ్యాటరీ ప్యాక్‌ను అమర్చారు. కేవలం 2 గంటల 40 నిమిషాల్లో 0 నుంచి 80 శాతం వరకు చార్జ్ అవుతుందని, పూర్తిగా చార్జ్ కావడానికి సుమారు 4 గంటల సమయం పడుతుందని హోండా తెలిపింది. హోండా క్యూసీ3 స్కూటర్‌లో అనేక ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. హోండా రోడ్‌సింక్ యాప్ కనెక్టివిటీ, టర్న్-బై-టర్న్ నావిగేషన్ సదుపాయంతో కూడిన 5-అంగుళాల డిస్‌ప్లే, స్మార్ట్ కీ వంటివి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. సీటు కింద 32 లీటర్ల విశాలమైన స్టోరేజ్ స్పేస్ ఇవ్వడం మరో ప్రత్యేకత. తొలి దశలో ఢిల్లీ, ఆగ్రా, కటక్, సూరత్, కొల్లం నగరాల్లో ఈ స్కూటర్ అందుబాటులో ఉంటుంది. దశలవారీగా దేశవ్యాప్తంగా విక్రయాలను విస్తరిస్తామని కంపెనీ పేర్కొంది. మ్యాట్ ఫాటాన్ గ్రే మెటాలిక్, పెరల్ ప్రిషియస్ వైట్, పెరల్ షలో బ్లూ, పెరల్ సైరన్ బ్లూ అనే నాలుగు ఆకర్షణీయమైన రంగుల్లో ఇది లభిస్తుంది. ఈ ఏడాది జులైలోనే ఈ స్కూటర్‌ను కంపెనీ ప్రదర్శనకు ఉంచింది.

# సీఎం విజయ్ లండన్ పర్యటన.. 'రుతుస్రావం' ప్రచారాన్ని ఖండించిన మంత్రి కీర్తన

**సీఎం లండన్ పర్యటనకు మంత్రి కీర్తన గైర్హాజరుపై వివాదం**

**శస్త్రచికిత్స కారణంగానే పర్యటనకు దూరంగా ఉన్నట్లు వెల్లడి**

**తన ఆరోగ్యం వ్యక్తిగత విషయమని, ఊహాగానాలు తగవని హితవు**

**మహిళల ఆరోగ్యంపై చౌకబారు విమర్శలను ఖండించిన టీవీకే నేతలు**




తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ లండన్ పర్యటనకు తాను గైర్హాజరు కావడంపై చెలరేగిన వివాదంపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. కీర్తన స్పష్టత ఇచ్చారు. ఒక చిన్న వైద్య ప్రక్రియ కారణంగానే తాను పర్యటనకు దూరంగా ఉన్నానని, ఆరోగ్యం అనేది పూర్తిగా వ్యక్తిగత విషయమని ఆమె తేల్చిచెప్పారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు సీఎం విజయ్ లండన్‌లో పెట్టుబడుల ఆకర్షణ కోసం పర్యటించారు. ఈ పర్యటనకు మంత్రి కీర్తన వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది. కీర్తన నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఉన్నారని మరో మంత్రి ఆధవ్ అర్జున చెప్పగా, డీఎంకే సానుభూతిపరురాలైన విమర్శకురాలు వైష్ణవి ఆ వ్యాఖ్యలను రుతుస్రావంతో ముడిపెడుతూ ప్రశ్నించారు. ఇది సహజ శారీరక ప్రక్రియ అయితే, దానిని ఒక కారణంగా ఎందుకు చెప్పాలని ఆమె అనడం లైంగిక వివక్ష ఆరోపణలకు దారితీసింది. ఈ వివాదంపై మంత్రి కీర్తన స్వయంగా వివరణ ఇచ్చారు. గతంలో అయిన గాయం కారణంగా అమర్చిన మెడికల్ ఇంప్లాంట్‌తో అసౌకర్యం కలగడంతో, దానిని సర్జరీ ద్వారా తొలగించాలని వైద్యులు సూచించారని తెలిపారు. అయితే, సెప్టెంబర్ 9న హెచ్‌డీ హ్యుందాయ్‌తో కీలక సమావేశం ఉండటంతో సర్జరీని వాయిదా వేసుకున్నానని, ఆ తర్వాత సర్జరీ జరిగిందని, వైద్యులు విశ్రాంతి సూచించారని వెల్లడించారు. ఈ సమయంలోనే లండన్ పర్యటన ఏర్పాట్లను దూరం నుంచే పర్యవేక్షించానని, తన గైర్హాజరుకు వేరే కారణం లేదని స్పష్టం చేశారు. ఆమెకు కాలర్‌బోన్ సర్జరీ జరిగిందని సహచర ఎమ్మెల్యే కనిమొళి సంతోష్ కూడా ధ్రువీకరించారు. "ఒక వ్యక్తి ఆరోగ్యం వ్యక్తిగత విషయం కాబట్టే నేను ఈ విషయాన్ని ముందుగా వెల్లడించలేదు. ప్రజా జీవితంలో ఉన్నవారి పనితీరును విశ్లేషించాలి కానీ, వారి ఆరోగ్యంపై ఊహాగానాలు చేయడం సరికాదు. మహిళలు తమ వ్యక్తిగత గోప్యత, గౌరవం మధ్య ఎంచుకోవాల్సిన పరిస్థితి రాకూడదు" అని కీర్తన తన ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా మంత్రి గైర్హాజరును అనారోగ్యం లేదా ఇతర కారణాలతో చూడకుండా, కేవలం జీవ సంబంధమైన అంశంతో ముడిపెట్టడాన్ని టీవీకే నేతలు "తిరోగమన ఆలోచనా ధోరణి"గా ఖండించారు. తమిళనాడులో అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే మధ్య రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వివాదం చోటుచేసుకోవడం గమనార్హం.

# సీఎన్ఎన్, పొలిటికో జర్నలిస్టులకు వైట్‌హౌస్ ప్రవేశం పునరుద్ధరించాలి

మొదటిపేజీ తరువాయి

14 రోజుల పాటు నిషేధాన్ని అమలు చేయవద్దని, ప్రెస్ పాసులు వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. జాతీయ భద్రత కారణాలతో నిషేధం విధించినట్లు ప్రభుత్వం వాదించినా, దానికి ఆధారాలు లేవని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ట్రంప్ స్వయంగా ఈ మీడియా సంస్థలు 'అబద్ధాలు, నెగిటివ్ రిపోర్టింగ్' చేస్తున్నాయని చెప్పి నిషేధించారని పేర్కొన్నారు. ఫస్ట్ అమెండ్‌మెంట్ కింద ప్రెస్ స్వేచ్ఛకు భంగం కలిగిందని, డ్యూ ప్రాసెస్ లేకుండా నిషేధం విధించారని జర్నలిస్టులు వాదించారు. ఈ న్యాయపోరాటం నవంబర్ 3న జరిగే మిడ్‌టర్మ్ ఎన్నికలకు కొన్ని వారాల ముందు వచ్చింది. ప్రెస్ ఫ్రీడమ్ సంస్థలు, అనేక మీడియా గ్రూపులు ఈ మూడు సంస్థలకు మద్దతు ప్రకటించాయి.

# ఎన్నికల సంఘం యాప్‌పై మరోసారి వివాదం..

మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) సమయంలో కొన్ని పేర్లపై సాఫ్ట్‌వేర్ అభ్యంతరాలు చూపింది. క్షేత్రస్థాయిలో సరిగ్గా పరిశీలించిన తర్వాత 97 మంది ఓటర్లు అర్హులేనని స్థానిక అధికారులు నిర్ధారించారు. కానీ వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైన రోల్‌బ్యాక్ సౌకర్యం యాప్‌లో లేదు. దీంతో గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఢిల్లీలోని ఎన్నికల సంఘానికి పదేపదే అభ్యర్థనలు పంపారు. అయినా అనుమతి రాకపోవడంతో ఆ పేర్లు జాబితాలోకి రాలేకపోయాయి. యాప్‌పై పూర్తి నియంత్రణ ఢిల్లీ వద్దే ఉందని సమాచారం. ఓటరు జాబితాలో పేరు లేకపోతే కేవలం ఓటు మాత్రమే కాదు... గోవా మెడిక్లెయిమ్ పథకం కింద డయాలసిస్, గుండె శస్త్రచికిత్స, అవయవ మార్పిడి, కీమోథెరపీ వంటి కీలక చికిత్సలకు కూడా అవకాశం దక్కదు. ఈ పథకం రాష్ట్ర ఓటర్లకే పరిమితం కావడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నారని థరూర్ ఆందోళన వ్యక్తం చేశారు. తన సోషల్ మీడియా పోస్టులో ఆయన "ఇది కేవలం రాజకీయ సమస్య కాదు. పౌరుల ప్రాథమిక హక్కులు, ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ఇలాంటి అమానుష వ్యవస్థను కొనసాగించకూడదు. ఎన్నికల సంఘం వెంటనే క్షమాపణ చెప్పి, ఈ సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేయాలి. జరిగిన నష్టాన్ని సరిదిద్దాలి" అని స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు.. అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

మొదటిపేజీ తరువాయి

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలకు జరుగుతున్న కష్టాలు, మోసాలను ప్రతి గడప వద్దకూ వెళ్లి వివరించాలని కేడర్‌కు సూచించారు. వైసీపీ హయాంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రభుత్వం అధికార బలంతో పాటు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ అనేక అడ్డదారులు తొక్కుతుందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలాంటి కుట్రలు ఎదురైనా తట్టుకునేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, రీజినల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# డేటా సెంటర్లకు ఏపీ కొత్త విధానం.. 70 శాతం గ్రీన్ ఎనర్జీ తప్పనిసరి: నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి

డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్‌లో కనీసం 70 శాతం సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే ఉండాలనే నిబంధనను తప్పనిసరి చేశామని ఆయన తెలిపారు. గురువారం ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డేటా సెంటర్ల ఏర్పాటుకు పర్యావరణపరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ క్లస్టర్ నీటి అవసరాల కోసం పోలవరం ఎడమగట్టు కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నామని చెప్పారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని విశాఖకు మళ్లించి డేటా సెంటర్ల అవసరాలు తీరుస్తామన్నారు. నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే ఒక సంస్థ ఈ దిశగా ముందుకొచ్చిందని వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన లక్ష్యంగా 23 రంగాల వారీగా ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. సిమెంట్, ఆటోమొబైల్ వంటి సంప్రదాయ తయారీ రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రేర్ ఎర్త్ మినరల్స్, బయోమెడికల్, ఫార్మా వంటి ఆధునిక రంగాలకు కూడా ఈ క్లస్టర్లలో చోటు కల్పించామన్నారు. ఏపీలో గూగుల్ భారీ పెట్టుబడి పెడుతోందని, దీని స్ఫూర్తితో మరిన్ని కంపెనీలు డేటా సెంటర్ల రంగంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. అమరావతి కేంద్రంగా క్వాంటం టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఐబీఎం నుంచి 150-క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతికి తీసుకొచ్చిన తొలి రాష్ట్రం ఏపీ అని గుర్తుచేశారు. ఈ సాంకేతికతకు అవసరమైన క్రయోజెనిక్స్, మెటీరియల్ సైన్సెస్ వంటి అనుబంధ రంగాలనూ అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు అన్ని రంగాల్లోనూ రాణించాల్సి ఉంటుందన్నారు. క్వాంటం టెక్నాలజీ ఎంత ముఖ్యమో, హార్టికల్చర్, ఆక్వాకల్చర్ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. అక్టోబర్ 2న దాదాపు రూ.1 లక్ష కోట్లతో హార్టికల్చర్ మిషన్‌ను ప్రారంభిస్తున్నామని, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో "ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్"ను ఏర్పాటు చేసి వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహిస్తామని ప్రకటించారు.

# నేడు ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం

ప్రజా సీమ

ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న ఈ జరుపుకుంటారు. అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (ఫిప్రా) 2009లో ఈ దినోత్సవాన్ని స్థాపించింది.ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలలో ఫార్మసిస్ట్‌ల కీలక పాత్రను గుర్తించడానికి ఈ రోజును పాటిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఫార్మసిస్ట్‌లు రోగులకు సురక్షితమైన, ప్రభావవంతమైన మందులను అందించడంలో, ఆరోగ్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తారు.వ్యాధి నివారణ, ఆరోగ్య అవగాహన పెంపుదలలో కూడా ఫార్మసిస్ట్‌లు ముఖ్యమైన సహకారం అందిస్తారు.ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం రోజున, ఫార్మసిస్ట్‌లు ఆరోగ్య సంరక్షణ రంగంలో తమ కృషిని చాటుకోవడానికి, ప్రపంచ ఆరోగ్య అవసరాలను తీర్చడానికి తమ నిబద్ధతను చాటడానికి సమావేశమవుతారు.




# వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మడగలం శ్రీనివాసులు

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మడగలం శ్రీనివాసులు గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ వ్యవహారాలపై చర్చ జరిగినట్లు మడగలం శ్రీనివాసులు తెలిపారు. బూత్ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి నాయకులతో సమన్వయం చేసుకుని పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు పేర్కొన్నారు.అలాగే పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారని, పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు సాగాలని సూచించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మడగలం శ్రీనివాసులు మాట్లాడుతూ, పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు.



# తెలుగు సినిమా గీతాలకు దొరికిన ఒకానొక ఆణిముత్యం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

## - ఇంజనీర్ కావాలని కలలు కని గాయకుడైన ఎస్పీబి
## - నలభై వేల పైచిలుకు పాటలు పాడి గిన్నిస్ రికార్డును సాధించారు
## - నేడు ఆయన వర్ధంతి

ప్రజా సీమ

తెలుగు సినిమా గీతాలకు దొరికిన ఒకానొక ఆణిముత్యం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. ఎస్పీ బాలు పూర్తి పేరు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం.. 1946 జూన్ 4న నెల్లూరులోని కోనేటమ్మ పేట గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఈయన సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతుల రెండో సంతానం. ఇంజనీర్ కావాలని కలలు కని గాయకుడయ్యారు. సావిత్రిని వివాహం చేసుకున్న ఆయనకు చరణ్, పల్లవి అని ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న(1966) చిత్రంలోతొలిసారి పాట పాడారు. శంకరాభరణం, సాగరసంగమం లాంటి తెలుగు చిత్రాలే కాకుండా 'ఏక్ దుజే కేలియే' లాంటి హిందీ చిత్రాలకు బాలు పాడిన పాటలు దేశమంతా ఉర్రూతలూగించాయి. నాలుగు దశాబ్దాలకు పైగా సాగినసినీ ప్రస్థానంలో నలభై వేల పైచిలుకు పాటలు పాడి గిన్నిస్ రికార్డును సాధించారు. తెలుగు, తమిళమే కాకుండా కన్నడంలోనూ ఆయన పాడిన పాటకు ఎన్నో జాతీయ పురస్కారాలు లభించాయి. తమ్ముడు కమల్ హాసన్‌కు చేతిలో సినిమాలు లేని సమయంలో ఆయన మీదున్న ప్రేమతో బాలు నిర్మాతగా మారారు. అలా తీసిని 'శుభ సంకల్పం' ఎన్నో అవార్డులను తెచ్చి పెట్టింది. కమల్ హాసన్, రజనీకాంత్, సల్మాన్ ఖాన్, జెమిని గణేషన్ వంటి పలువురు హీరోలకు గాత్రదానం కూడా చేశారు. గాన మాధుర్యంతోనే కాదు, నటనతోనూ బాలు ప్రేక్షకులను కట్టిపడేశారు. 1969లో పెళ్ళంటే నూరేళ్ళ పంట అనే చిత్రంలో మొదటిసారి నటుడిగా కనిపించారు. తమిళ 'కేలడి కన్మణి'లో కథానాయకుడి పాత్ర పోషించారు. ఈ సినిమా తెలుగులో ఓ పాప లాలీ పేరుతో అనువాదం అయింది. తర్వాత పవిత్ర బంధం, దేవుళ్లు, దేవదాస్, మిథునం వంటి పలు సినిమాల్లోనూ నటించారు. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం..తెలుగు సినిమా గీతాలకు దొరికిన ఒకానొక ఆణిముత్యం. విషాద పాటలైనా, ప్రేమ గీతాలైనా, మాస్ బీట్స్ అయినా.. సందేశాత్మకాలైనా.. ప్రతీది ఆయననోట అలవోకగా జాలువారుతాయి. ఘంటసాల తరువాత ఆ స్థాయి పేరు ప్రఖ్యాతలు పొందిన ఏకైక గాయకుడు. హీరోల వాయిస్ తగినట్లు పాడడం ఆయన స్పెషల్. చాలామంది నటులకు వారి హావభావలకు, నటనా శైలులకు అనుగుణంగా అతను పాటలు పాడి ప్రాణం పోశారు. జీవితాన్నే మార్చేసిన 'శంకరాభరణం'ఘంటసాల మరణం తర్వాత తెలుగు సినిమా పాటలకు ఎస్పీ బాలుయే పెద్ద దిక్కయ్యారు. తన గాత్రంతో పాత్రలకు ప్రాణం పోశాడు. ముఖ్యంగా బాలు సినీ జీవితం 'శంకరాభరణం'సినిమాతో పూర్తిగా మారిపోయింది. అప్పటివరకు మాస్ గీతాలకే పరిమితం అయిన బాలు.. ఈ సినిమాలో క్లాసికల్ పాటలను సైతం అద్భుతంగా పాడగలనని విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్నాడు. ఈ చిత్రానికి బాలు తొలిసారి జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డు అందుకున్నాడు. తెలుగులోనే కాదు ఉత్తరాదిన కూడా పాడి తన సత్తా చాటాడు బాలూ. హిందీలో తొలిసారి 'ఏక్ దూజేలియే' చిత్రంలో.. అద్భుతంగా పాడి అక్కడివారిచేత శభాష్ అనిపించుకున్నాడు. ఈ సినిమాకు కూడా ఉత్తమ గాయకుడిగా జాతీయ అవార్డు దక్కడం విశేషం. తెలుగు తో పాటు హిందీ, తమిళం, కన్నడ లాంటి నాలుగు భాషల్లో కలిపి ఆరు సార్లు జాతీయ ఉత్తమగాయకుడిగా నిలవడం ఒక్క బాలసుబ్రహ్మణ్యానికే చెల్లింది. ముఖ్యంగా భక్తి పాటలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. అన్నమయ్య, శ్రీరామదాసు, శ్రీరామరాజ్యం చిత్రాలలో బాలు ఆలపించిన భక్తి గీతాలు ఇప్పటకి ప్రతి ఇంటావినిపిస్తూనే ఉన్నాయి.ఎస్పీ బాలు సుదీర్ఘ ప్రస్థానంలో 6 జాతీయ పురస్కారాలు, 6 ఫిల్మ్ ఫేర్ దక్షిణాది పురస్కారాలు, ఒక ఫిల్మ్ ఫేర్ పురస్కారం అందుకున్నాడు. 1979 లో వచ్చిన సంగీత ప్రధానమైన శంకరాభరణం చిత్రానికి ఆయనకు జాతీయ పురస్కారం లభించింది. రెండు సంవత్సరాల తర్వాత ఆయనకు 1981 లో బాలీవుడ్ లో ప్రవేశించి



ఏక్ దూజే కేలియే చిత్రానికి గాను రెండోసారి పురస్కారాన్ని అందుకున్నాడు. తర్వాత సాగర సంగమం(1983), రుద్రవీణ (1988) చిత్రాలకు జాతీయ పురస్కారాలు అందుకున్నాడు. 25 సార్లు ఉత్తమ గాయకుడిగా, ఉత్తమ సంగీత దర్శకుడిగా, ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్టుగా, ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారాలు అందుకున్నాడు. 2001లో పద్మశ్రీ, 2011లో పద్మభూషన్ వరించింది. 1999లా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 74 ఏళ్ల వయస్సులో చెన్నైలోని ప్రయివేటు ఆసుపత్రిలో సెప్టెంబర్ 25, 2020 న కన్నుమూశారు. గురువారం రాత్రి నుంచి శ్వాస తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డ ఆయన శుక్రవారం మధ్యాహ్నం 1.04 నిమిషాలకు వెంటిలేటర్‌పైనే తుది శ్వాస విడిచారు. త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో వస్తాడనుకున్న అభిమానులను శోకసంద్రంలో ముంచేసి తిరిగి రాని లోకాలకు బాలు వెళ్లిపోయారు. బాలు గురించి మరికొన్ని విషయాలు: ఓ ఇంటర్వ్యూలో బాలు ఇళయరాజాను బెస్ట్ కంపోజర్‌గా పేర్కొన్నారు. కానీ అదే ఇళయరాజా తన పాటలు ఎవరు పాడినా దానికి ఇంత రాయల్టీ ఇవ్వాలని బాలు అబ్బాయి నిర్వహిస్తున్న సంస్థకు తాఖీదులు పంపారు. మిత్రుడికి లీగల్ నోటీస్ ఇవ్వడమేంటని ఆయన చాలా బాధపడ్డారు.బాలుకు అత్యంత ఇష్టమైన గాయకుడు మహమ్మద్ రఫీ. శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న చిత్రానికి గానూ మొదటి రెమ్యూనరేషన్ 300 రూపాయలు తీసుకున్నారు. ఒక్క శంకరాభరణం సినిమాకు పాడే విషయంలో మాత్రమే ప్రత్యేకంగా ప్రాక్టీసు చేశారు. గాయకుడిగానే కాకుండా గాత్రదాన కళాకారుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా ఆయా విభాగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేత 29 సార్లు నంది పురస్కారాలు అందుకున్నారు.

# మంథనిలో ప్రశాంతమైన వాతావరణంలో గణేశుని నిమజ్జనం

-రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరువతో ప్రత్యేక ఏర్పాట్లు

-నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్

ప్రజా సీమ

మంథని పట్టణంలోని గోదావరి నదిలో బుధవారం, గురువారం భారీగా గణనాథుల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించారు.వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు. నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చోరువతో నిమజ్జన కార్యక్రమానికి భారీగా భక్తులు, ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.గణపతి విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా క్రేన్‌ను ఏర్పాటు చేసి, భక్తులకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వర్షం కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.నిమజ్జనానికి వచ్చిన భక్తులు, ప్రజల కోసం వైద్య సహాయం, త్రాగునీరు, వీధి దీపాలు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిమజ్జన ప్రాంతంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు.అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో వర్షంలో సైతం గణేశుని నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా ముగిసిందని తెలిపారు.గురువారం కూడా గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా భక్తులు, ప్రజలు సహకరించాలని చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలోమంథని ఆర్డీవో కసబోయిన సురేష్,మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్, తాసిల్దార్ మహమ్మద్ ఆరీఫొద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు ,సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. స్వామి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సందీప్ కుమార్, గౌతమేశ్వర టెంపుల్ చైర్మన్ గుండా రాజు, పలువురు నాయకులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు





# తిరుపతిలో భారీ భవన నిర్మాణ పనుల పరిశీలన

కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం

భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి)

ప్రజా సీమ

తిరుపతిలో కొనసాగుతున్న భారీ భవన నిర్మాణ పనులను భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్, తెదేపా తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) గురువారం పరిశీలించారు. హై రైజ్ భవనాల పరిశీలనలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భారీ భవన సముదాయాన్ని ఆయన సందర్శించారు. సుమారు రూ.327 కోట్ల వ్యయంతో జీం8 అంతస్తులతో, దాదాపు 1,070 గదులతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతి, నిర్మాణ ప్రమాణాలు, కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం తిరుపతిలోని లేబర్ అడ్డా నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, కార్మిక బోర్డు ద్వారా లభించే ప్రయోజనాలను అర్హులైన ప్రతి కార్మికుడికి సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్మాణ రంగ కార్మికుల



ప్రజాసీమ

## ఆకర్షణీయంగా పాలకొండల జలపాతాలు

సిద్ధవటం ప్రజా సీమ

కడప నగర్ శివారులోని పాలకొండల వద్ద జలపాతాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలకి కొండ ప్రాంతాల నుంచి పాలకొండలకు వర్షపు నీరు వచ్చి చేరుతోంది.ఆ కొండపై నుంచి జాలాలు పారుతూ నీరు కిందికి పడుతూండటంతో నీటితో కళకళలాడుతోంది. ఈ జలపాతాలను వీక్షించేందుకు ప్రజలు పాలకొండలకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. వర్షపు నీరు మరింత పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు



## సిద్ధవటం పెన్నా నదికి జలకళ

సిద్ధవటం ప్రజా సీమ

మండల కేంద్రమైన సిద్ధవటం పెన్నా నది జలకల సందరించుకుంది ఇన్నాళ్లు వేలవేల బోయిన నీటి చుక్క లేక పోయిన పెన్నా నది నేడు నిండుకుండలా జల ప్రవాహంతో ప్రజలందరినీ ఆహ్లాదపరుస్తూ ఆనందానికి గురిచేస్తుంది ఈ సందర్భంగా సిద్ధవటం మండల ప్రజలు పెన్నా నది భారీ నీటి ప్రవాహం రావడంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పెన్నమ్మ తల్లికి పూజలు చేశారు





# ఆక్రమిత భూములు వెనక్కి తీసుకుంటాం

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కేసులు నమోదు

## సిద్ధవటం తహసీల్దార్ విజయ్‌కుమార్

సిద్ధవటం ప్రజా సీమ

మండల పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ రెవెన్యూ డీకేటీ భూములను గుర్తించి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటామని సిద్ధవటం తహసీల్దార్ విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం సిద్ధవటంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ రెవెన్యూ డీకేటీ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించి వాటిని పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు. ఆక్రమిత డీకేటీ భూముల్లో సాగు చేస్తున్నా, ఇతర విధాలుగా వినియోగిస్తున్నా వాటిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటామని తెలిపారు.ప్రభుత్వ భూములు, ప్రభుత్వ స్థలాలను ఎవరైనా కబ్జా చేయడానికి ప్రయత్నించినా, ఆక్రమణలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని తహసీల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు.



# బాల్యవివాహాల రహిత మదనపల్లెని నిర్మిద్దాం

## - బాలల రక్షణ కమిటీ సభ్యులు కొప్పల హరినాథ్,సీతక యుగంధర్ పిలుపు

## - హాజరైన ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ

మదనపల్లె (ప్రజా సీమ) :

బాల్య వివాహాల వలన ఎదురయ్యే పరిణామాలు,అదేవిధంగా సంపూర్ణంగా విద్యను పొందితే బాలికల భవిష్యత్తులో జరిగే పరిణామాలు తెలిపే గోడపత్రికలను గురువారం పట్టణంలోని శివాజీ నగర్,బసినికొండ కాలనీల్లో విడుదల చేశారు.ఈ సందర్భంగా బాలల రక్షణ కమిటీ సభ్యులు కొప్పల హరినాథ్,సీతక యుగంధరలు మాట్లాడుతూ మదనపల్లెను బాల్య వివాహాలు జరగని పట్టణంగా మార్చడం మనందరి బాధ్యత అని తెలిపారు.ప్రభుత్వం పిల్లలకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని,ఒక ఇంట్లో ఎంతమంది చదువుతున్నా అందరికీ తల్లికి వందనం పథకం అందిస్తోందని తెలిపారు.ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు వాళ్ల భవిష్యత్తును వాళ్లే తీర్చిదిద్దుకోవాలని తెలిపారు.అనంతరం ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ మాట్లాడుతూ సమాజంలో బాల్యవివాహాలు జరగడం అధికమైపోతున్నాయన్నారు.దీనికి ముఖ్య కారణం పిల్లలు వారి భవిష్యత్తుపైన దృష్టి కేంద్రీకరించలేకపోవడం ఆన్ లైన్,సెల్ ఫోనులో ప్రభావం అధికం కావడం, పిల్లలు తల్లిదండ్రులను,ఉపాధ్యాయులను దిక్కరించడం,ఆకర్షణలకులోనుకావడం మొదలగునవే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయన్నారు. ఇవన్నీ తాత్కాలికాలు,జీవితాలను ఇవ్వలేవు అని గ్రహించవలసిన అవసరం ఉంది.సెల్ ఫోన్లో భవిష్యత్తుకు అవసరమైన సేవలను మాత్రమే చూసుకుంటే పిల్లలు సాంకేతికంగా ముందుకు వెళ్లగలిగే అవకాశం ఉందని తెలిపారు.అన్ని గ్రామ కాలనీలలో విద్య యొక్క ప్రాధాన్యత పిల్లల్లో పెరగి బాల్యవివాహాలను అరికట్టాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ పోస్టర్లు నిర్వహణకు సహకారం అందించిన కొప్పల హరినాథ్,సీతక యుగంధర్ వారికి ఫోర్డ్ సంస్థ తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ విధంగా దాతలు అన్ని స్లమ్ ఏరియాల్లోనూ ఇలాంటి పోస్టర్లు ఆవిష్కరణకు ముందుకు వచ్చి పేద పిల్లల భవిష్యత్తుకు మంచి మార్గాలను చూపాలని కోరారు.ఈ సందర్భంగా స్థానిక అంగన్వాడి టీచర్ మధురవాణి మాట్లాడుతూ తల్లిదండ్రులు మా బాధ్యత తీరిపోతుందనే ఉద్దేశ్యంతో పెళ్లిళ్లు చేయకుండా చదివించాలని,చదువుకుంటే ఉద్యోగాలే కాకుండా ఎన్నోరకాల చేతివృత్తులు కూడా అందుబాటులో ఉన్నాయని,అందులో స్థిరపడవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రెడ్డి లక్ష్మీ,శ్రీనివాసులు,ఎం.ఎస్.కే స్రవంతి,ఫోర్డ్ సిబ్బంది స్వర్ణ కుమారి,జయలక్ష్మి, నరసింహా, సిబిఓలు రాజకుమార్, నాగరాజు, వసంత ఫిర్దోస్,విద్యార్థిని విద్యార్థులు,సీబీఓ సభ్యులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ గా చల్లా బాలాజీ

### - ఏకగ్రీవంగా ఎన్నుకున్న మానవత కుటుంబ సభ్యులు

వేంపల్లె ప్రజాసీమ:



మానవత ఆత్మీయ సహకార కమిటీ వేంపల్లె మండల చైర్మన్ గా చల్లా బాలాజీ ఎన్నికయ్యారు. గురువారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి సమక్షంలో కుటుంబ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్ గా ఎన్నికైన చల్లా బాలాజీకీ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చల్లా బాలాజీ మాట్లాడుతూ తనను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ.. కమిటీ అభివృద్ధితో పాటు మానవత లక్ష్యాలను ప్రజల్లో తీసుకెళ్లి ఉత్తమ సమాజ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే మానవత కుటుంబ సభ్యత్వాలు పూర్తి చేసి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా నగదును అందజేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, సహాయ చైర్మన్ కావలి కృష్ణతేజ, కన్వీనర్ రంగారెడ్డి, అధ్యక్షుడు సుభాష్, జిల్లా సంయుక్త కార్యదర్శి డా.యోగీశ్వర బాబు, గోవర్ధన్, రాజారాం, రెడ్డయ్య, శ్రావణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాధ్యత రాహిత్యానికి పరాకాష్ట

### - సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై శ్రద్ధ చూపాలి

### - ఏపిసిసి మీడియా చైర్మన్ డా.తులసిరెడ్డి

వేంపల్లె ప్రజాసీమ:



నంద్యాల జిల్లా, పాణ్యం మండలంలోని గోరకల్లు గ్రామం వద్ద ఉన్న గోరకల్లు రిజర్వాయర్ గేట్లను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తడం, వరద నీరు ఆ గ్రామాన్ని జలమయం చేయడం దురదృష్టకరమని, కూటమి ప్రభుత్వ బాధ్యత రాహిత్యానికి ఈ సంఘటన పరాకాష్ట అని ఏపిసిసి మీడియా చైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. ఆ జలాశయం గేట్లు ఎత్తడం ద్వారా కాలువ సామర్థ్యానికి మించి నీరు ప్రవహించడం రక్షణ కట్ట తెగిపోవడం వల్ల వరదనీరు గ్రామంలోకి ప్రవేశించిందని, ప్రజలు గ్రామాన్ని విడిచి వేణుగోపాల స్వామి కొండమీదికి పరుగులు తీశారని, దాదాపు 450 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఎలక్ట్రీషియన్ కొండయ్య తన ప్రాణాలకు తెగించి ఆ గేటును కిందకి దించకపోయింటే జలప్రళయం జరిగి ఉండేదన్నారు. రిజర్వాయర్లు, ప్రాజెక్ట్ ల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం, బాధ్యత రాహిత్యం దీని ద్వారా స్పష్టమైందన్నారు. కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు, జలాశయాల నిర్వహణ మీద ప్రత్యేక శ్రద్ధ చూపాలని తులసిరెడ్డి కోరారు.

# ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఫౌండేషన్ డే

## - చంద్రమాకులపల్లెలో మొక్కల నాటే కార్యక్రమం







మదనపల్లె (ప్రజా సీమ) :

ఎన్‌ఎస్‌ఎస్ ఫౌండేషన్ డే సందర్భంగా పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మదనపల్లె ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం చంద్రమాకులపల్లె గ్రామంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు .పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందించడం మరియు గ్రామీణ ప్రాంతాల్లో చెట్ల ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా చేపట్టారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.వర్షాలు సరిగా కురవకపోవడం వల్ల పర్యావరణ సమతుల్యతపై ప్రభావం పడుతోందని,ఈ పరిస్థితుల్లో ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు.మొక్కలు నాటడమే కాకుండా వాటి పెరుగుదలకు అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు .కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై.అరుణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు,గ్రామస్థులు మొక్కలను నాటారు.నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు మరియు గ్రామస్థులు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది బి.గోపాల్‌రావు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు .పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందిం చేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు వైకాపా ఆరాటం

## - ప్రజా సమస్యల కంటే రాజకీయ అస్థిత్వమే ముఖ్యమా!

## - బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



వేంపల్లె ప్రజాసీమ:

వైకాపా రాజకీయ వ్యవహార శైలి చూస్తుంటే.. ప్రజా సమస్యల పరిష్కారం కంటే తన రాజకీయ అస్థిత్వాన్ని కాపాడు కోవడంపై ఎక్కువ దృష్టి పెట్టినట్లు కనిపిస్తోందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ప్రజల తరపున ప్రతి పక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే బాధ్యత ఉంటుందని, అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా అంశంపై వైసిపి బహిష్కరణ వైఖరి అవలంబిచడం, మరోవైపు మీడియా సమావేశాలు, బయట రాజకీయ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాన్ని ఎదుర్కొనే వ్యూహాన్ని ప్రకటించడంపై ఆ పార్టీ రాజకీయ ప్రాధాన్యతల గురించి అనుమానాలను కలిగిస్తోందన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయడం, రాజకీయ ఉనికిని నిలబెట్టు కోవడానికి ప్రతి అంశాన్ని రాజకీయ పోరాటంగా మార్చడం వేరన్నారు. ఆ రెండింటి మధ్య ఉన్న తేడాని ఆ పార్టీ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. రాజధాని విషయంపై 2029 ఎన్నికల్లో మావిగన్ అంశాన్ని ప్రధాన రాజకీయ అంశంగా తీసుకెళ్తామని వైసిపి ప్రకటనపై ఎద్దేవా చేశారు.

ప్రజాసీమ

# కడప జిల్లా లో మోస్ట్ వాంటెడ్ ఎర్ర స్మగ్లర్ పై పోలీసుల కాల్పులు

## కత్తితో దాడికి యత్నం.. ఎడమ కాలికి బుల్లెట్

## జాకీర్‌పై 99 కేసులు కేసులు

## ఏడుదుంగలు , స్విఫ్ట్ కారు స్వాధీనం

## కడప జిల్లా ఎస్పీ నచ్చికేత్ విశ్వనాథ్

**కడప సెప్టెంబర్ 24 (ప్రజాసీమ):**

మోస్ట్ వాంటెడ్ ఎర్ర ఎర్రచందనం స్మగ్లర్ పై కడప జిల్లాలో కాల్పులు ఘటన చోటు చేసుకుంది... ఈ ఘటనపై మైదుకూరులో పాత్రికేయులతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఉంచిన పోలీసులు మోస్ట్ వాంటెడ్ స్మగ్లర్ జాకీర్‌ను పట్టుకునే క్రమంలో కాల్పులు జరిగినట్లు తెలిపారు. దువ్వూరు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో జాకీర్ ఎడమ కాలికి బుల్లెట్ తగిలి గాయపడ్డాడు. ప్రాథమిక చికిత్స అనంతరం అతడిని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ గురువారం మైదుకూరులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దువ్వూరు వద్ద ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన ఐచర్ వాహనం, స్విఫ్ట్ డిజైర్ కారును గుర్తించారు. కారులో మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ జాకీర్ ఉన్నట్లు



గుర్తించి అతడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. జాకీర్‌ను పట్టుకునే సమయంలో అతడు ఎస్ఐ చిన్న పెద్దయ్య, కానిస్టేబుల్ చెన్నయ్యపై కత్తితో దాడికి యత్నించినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ దాడికి ప్రయత్నించడంతో ఎస్ఐ తొలుత రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినప్పటికీ జాకీర్ వెనక్కి తగ్గకుండా దాడికి ప్రయత్నించడంతో మరోసారి కాల్పులు జరిపారు. ఈ సమయంలో బుల్లెట్ జాకీర్ ఎడమ కాలికి తగిలింది. ఈ




ఘటనలో కానిస్టేబుల్ చెన్నయ్యకు గాయాలయ్యాయి. పోలీసులు జాకీర్ నుంచి స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకుని, ఏడు ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు.జాకీర్‌పై దాదాపు 99 క్రిమినల్ కేసులు ఉన్నాయని ఎస్పీ వెల్లడించారు. వీటిలో 82 కేసులు ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించినవేనని తెలిపారు. ఇప్పటికే నాలుగుసార్లు పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకున్నప్పటికీ అక్రమ రవాణాను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘాను మరింత పటిష్ఠం చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శించి నిందితుడిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టిన ఎస్ఐ చిన్న పెద్దయ్య, కానిస్టేబుల్ చెన్నయ్య తదితర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నియంత్రణలో పోలీసు సిబ్బంది చూపిన సాహసోపేత చర్యలను ప్రత్యేకంగా ప్రశంసించారు..ఫోటో మీడియాతో మాట్లాడుతున్న కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్.బుల్లెట్ గాయంతో చికిత్స పొందుతున్న జకీర్

# కోడిగుడ్లు,చిక్కీల పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేదు

## - ఆన్‌లైన్ విధానంలోనే మొత్తం ప్రక్రియ

## - డీఈఓకు వివిధ ఉపాధ్యాయ సంఘాల మద్దతు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

కోడిగుడ్లు,చిక్కీల ఇండెంట్లు,పంపిణీ,వినియోగం,అప్రూవల్స్, బిల్లుల ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ విధానం ద్వారా జరుగుతున్నందున ఇందులో అక్రమాలు లేదా అవకతవకలకు అవకాశం లేదని సంఘ నాయకులు తెలిపారు.గురువారం వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఓ ప్రకటన విడుదల చేస్తూ 2025 జూన్ నుంచి డిసెంబర్ వరకు పాఠశాలల వారీగా నమోదైన ఇండెంట్లు,విద్యార్థుల సంఖ్య,వినియోగ వివరాలు,ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణ,ఆన్‌లైన్ అప్రూవల్స్,సరఫరా ఏజెన్సీల బిల్లులు వంటి వివరాలు రికార్డుల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ వివరాలను ఉన్నతాధికారుల తో నియమించబడిన కమిటీ పరిశీలిస్తున్న నేపథ్యంలో రికార్డులు పరిశీలించకముందే రూ.1.46 కోట్ల దుర్వినియోగం జరిగిందంటూ ఆరోపణలు చేయడం పూర్తిగా తగదని వారు స్పష్టం చేశారు.జిల్లాలో విద్యార్థుల విద్యా ప్రయోజనాలు, పాఠశాలల అభివృద్ధి,ఉపాధ్యాయుల సంక్షేమం కోసం బాధ్యతాయుతంగా పనిచేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారికి జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు సంపూర్ణ నైతిక ,మద్దతును ప్రకటిస్తూ కోడిగుడ్లు,చిక్కీల ప్రక్రియలో తప్పులు జరిగే అవకాశం లేదనే అంశాన్ని ఆన్‌లైన్ రికార్డులు,పాఠశాలల వారీ ధ్రువీకరణ పత్రాలు,బిల్లుల ఆధారంగా పరిశీలిస్తే స్పష్టమవుతుందన్నారు.ఏదైనా నిబంధనల ఉల్లంఘన అధికారికంగా నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి ఉపాధ్యాయ సంఘాలకు ఎటువంటి అభ్యంతరం లేదని,అయితే వాస్తవ నిర్ధారణకు ముందే ఒక బాధ్యతాయుతమైన అధికారిని దోషిగా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు,వాస్తవాల వక్రీకరణ,వ్యక్తిగత దుష్ప్రచారానికి పాల్పడకుండా సంబంధిత వ్యక్తులు సంయమనం పాటించాలన్నారు. ఆరోపణలు ఉంటే వాటికి సంబంధించిన ఆధారాలను సంబంధిత ఉన్నతాధికారులకు సమర్పించాలని కోరారు.ఆన్‌లైన్




విధానంలో పారదర్శకంగా జరుగుతున్న ప్రక్రియను వాస్తవాలు తెలుసుకోకుండా అనుమానాస్పదంగా చిత్రీకరించడం తగదని,రికార్డులద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని నిరాధార ఆరోపణలు చేయడం తగదని మండల విద్యాశాఖ అధికారుల జిల్లా అధ్యక్షులు రెడ్డి శేఖర్,ప్రభాకర్ రెడ్డి,నారాయణ,జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు,వై.వి.రమణ,ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన,ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ గిరిధర్ నాయక్,యుటిఎఫ్ జిల్లా నాయకులు పురం వెంకటరమణ, విజయ్ కుమార్,ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు,నోబెల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి,ఇస్మాయిల్,వైయస్సార్ టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి,సర్వేపల్లి రాధాకృష్ణ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్,స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంఘ అధ్యక్షులు నరేష్,ఆపస్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నరసింహులు,రమణారెడ్డి,ఏపీసిపిఎస్ఈఏ జిల్లా అధ్యక్షులు రాజేంద్ర,రూటా నాయకులు అన్నారు.

# పీలేరులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### 8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్.. రూ.15,260 నగదు స్వాధీనం

**పీలేరు ప్రజాసీమ:**

పీలేరు పట్టణంలోని ఆర్టీసీ నల్లగుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పీలేరు ఎస్సై లోకేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడి నిర్వహించినట్లు సమాచారం.పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ.15,260 నగదు, 7 సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడి చేసినట్లు తెలుస్తోంది. పట్టుబడిన వారిపై నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు



# చెరువులో కొనసాగుతున్న గణేష్ నిమజ్జనం..

**పజాసీమ:**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రం లో స్థానిక పెద్ద చెరువు వద్ద గణేష్ నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారము వివిధ గ్రామాల నుంచి తీసుకొచ్చి గణపతులను చెరువులో క్రేన్ ద్వారా నిమజ్జనం చేశారు. అక్కడ రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీ అధికారులు వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అన్ని విధాల చర్యలు చేపట్టారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాలు శనివారం వరకు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు వద్ద ఆర్ ఐ లు శరత్ నాయక్, సాదత్, జిపిఓ రాజు , తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం

## - గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు కుమార్ రాజా, జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు మానవత వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయ రెడ్డి, వేంపల్లె మండల చైర్మన్ చక్రపాణిరెడ్డి హాజరై.. గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు. అంతేకాకుండా కళాశాల ప్రాంగణంలో పండ్ల మొక్కలు నాటి వీటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ, అధ్యాపకులు నాగేంద్ర, సతీష్, హరిత, వీరారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# కన్నుల పండుగలా విఘ్నేశ్వరుడి నిమర్జనోత్సవాలు

## - ముఖ్య అతిథిగా హాజరైన చేనేత నాయకులు పురుం సహదేవ

## - భక్తులకు,ప్రజలకు పెద్ద ఎత్తున అన్నవితరణ

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణంలోని మూడవ వార్డు పరిధిలో రామారావు కాలనీ నందు రెండు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల నిమర్జనోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ వేడుకలకు చేనేత నాయకులు పురుం సహదేవ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఇందులో భాగంగా స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా సహదేవ మాట్లాడుతూ రామారావు కాలనీ పరిధిలో చేనేత కార్మికులు గణేష్ ఉత్సవాలను ఈ ఏడాది వేడుకగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు.భక్తిశ్రద్ధలతో నిత్యపూజలు అందుకున్న విఘ్నేశ్వరుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడన్నారు.ప్రజలు ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని తద్వారా ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు.గణనాథుడి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని,చేనేత రంగం పురోగతి సాధించి,చేనేత కార్మికుల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.అదేవిధంగా రెండో విడత నేతన్న సేవలో నిధులు త్వరగా విడుదల చేయాలని,చేనేత ముడి సరుకు ధరలు తగ్గించి చేనేతరంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అనంతరం చేనేత కార్మికులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.ఉత్సవ కమిటీ నిర్వహకులు పంచరత్నం,సుధాకర్,పూర్ణ,కుమార్ రెడ్డి,మహేష్,వెంకటేష్,శేఖర్,శ్రీకాంత్,చేనేత కార్మికులు ఆర్.శేఖర్,వెంకటనాగులు ,కే.పుల్లయ్య,ఏ.సోమశేఖర్,సి.వెంకటేశులు,జె.గురుప్రసాద్,జె.రెడ్డెప్ప,కె.రమణ తదితరులు పాల్గొన్నారు.





# డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన

## - బ్యాంకింగ్ రహస్య సమాచారం పంచుకోకూడదు

**వేంపల్లె ప్రజాసీమ:**

డిజిటల్ బ్యాంకింగ్ సేవల వినియోగంపై ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం ఎన్ఎస్ఎస్ అధికారి డా. కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఎస్బిఐ అసిస్టెంట్ మేనేజర్ ప్రదీప్, టీమ్ లీడ్ భారతి పాల్గొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తత ఎంతో అవసరమన్నారు. ఆన్లైన్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపుల వంటి సేవలు, సైబర్ మోసాల బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలపై సలహాలు సూచనలు చేశారు. బ్యాంకింగ్ లావాదేవీలపై రహస్య సమాచారాన్ని ఇతరులకు పంచుకో కూడదని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్ లు, లింక్, యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని విధ్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ టీమ్ లీడ్ శివరామకృష్ణ, ఎన్ఎస్-ఎస్ విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ.మిథున్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ ఇంఛార్జి మధుసూదన్ నాయుడు!

పుంగనూరు ప్రజా సీమ :

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గురువారం నియోజకవర్గ ఇంచార్జ్ మధుసూదన్ నాయుడు మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి బుధవారం పట్టణంలోని లోని ఆర్ఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్సిపి సమావేశంలో మాట్లాడిన మాటలను ఖండించారు. ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా కాలవ ద్వారా నీళ్లను కుప్పం వరకు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది అని ,హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లను కుప్పంకు తీసుకెళుతున్న మాట నిజమే, హంద్రీనీవా జలాలతో కుప్పం నియోజకవర్గ పలమనేరు నియోజకవర్గం లోని చెరువులను నింపుతాం అలాగే పుంగనూరు నియోజకవర్గంలోని చెరువులను నింపుతామని తెలిపారు.

సమ్మర్ స్టోరేజ్ మీ కుటుంబానికి లబ్ధి చేకూర్చడం కోసం చేశారే తప్ప..పుంగనూరు ప్రజలకు 10 సంవత్సరాలలో ఒక బిందెడు నీళ్లు ఇచ్చారా అని వ్యాఖ్యానించారు.

వైసీపీ ప్రభుత్వంలో 498 మంది టీడీపీ నాయకుల, కార్యకర్తల పై కేసులు పెట్టిన ఘనత మీది అని అదే పని మేము చేస్తే మీ కథ వేరే విధంగా ఉండేది అన్నారు . ఈ కార్యక్రమంలో మధుసూదన్ రాయల్, సుబ్రహ్మణ్యం రాజు, రామకృష్ణంరాజు, సోమల సురేష్, మేలు పట్ల బాలాజీ,లక్ష్మణ రాజు,రత్నమ్మ, న్యాయవాదిశైలేందర్,ఇబ్రహీం, ఖలీల్ భాషా, శ్రీనివాసులు రెడ్డి, కేశవులు, బండ్లపల్లి బ్రదర్స్, తాటి మాకుల పాల్యం బాలాజీ, మనోహర్ పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ వారికి పెద్దపీట వేయాలి
- అధిష్టానానికి టిడిపి యువనేత ప్రవీణ్ రాయల్ విజ్ఞప్తి

మదనపల్లె (ప్రజా సీమ)



త్వరలో ఏపీలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో యువతకు పెద్దపీట వేయాలని మదనపల్లె పట్టణానికి చెందిన టిడిపి యువనేత ప్రవీణ్ రాయల్ తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడంలో యువత ప్రధాన భూమిక పోషించిందన్నారు.పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన వారికి ప్రాధాన్యతనివ్వాలని కోరారు.టిడిపికి యువతే ప్రధాన బలమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ బాబులు పలు సమావేశాల్లో ఈ అంశాన్ని స్పష్టం చేశారని ఆయన గుర్తుచేశారు.పంచాయతీ,మున్సిపాలిటీ ఎన్నికల్లో యువతకు అధిక స్థానాలు కేటాయిస్తే సత్తా చాటుతామన్నారు.అదేవిధంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వేగంగా చేరవేయగలిగే శక్తి యువతకే ఉందన్నారు.ఇప్పటి నుండే యువశక్తికి రాజకీయంగా ప్రాధాన్యతనిస్తే భవిష్యత్తులో పార్టీ మరింత బలంగా తయారవుతుందని ఆయన వెల్లడించారు.ప్రస్తుతం పార్టీ సీనియర్లు,జూనియర్లతో సమతూకంగా కళకళలాడుతోందన్నారు.యువ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో పార్టీ యువతరం ఉరకలేస్తోందని,అందుకు తగ్గవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లు కేటాయిస్తే ప్రభంజనం సృష్టించడం ఖాయమని ప్రవీణ్ రాయల్ ధీమా వ్యక్తం చేశారు.

## సేవాకార్యక్రమాల్లో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ల పాత్ర భేష్

- మిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ ప్రశంసలు
- యూనివర్సిటీలో ఘనంగా ఎన్.ఎస్.ఎస్ ఆవిర్భావ దినోత్సవం

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో గురువారం ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్.ఎస్.ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ ఎన్.ఎస్.ఎస్ జెండాను ఆవిష్కరించి,ఎన్.ఎస్.ఎస్ ఆవిర్భావం,లక్ష్యాలు,సమాజ అభివృద్ధిలో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ల ప్రాముఖ్యతను వివరించారు.విద్యార్థుల్లో సేవా భావన,సామాజిక బాధ్యత,నాయకత్వ లక్షణాలు,దేశభక్తిని పెంపొందించడంలో ఎన్.ఎస్.ఎస్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.సమాజంలోని అవసరమైన వారికి సహాయం చేయడం,ప్రజల్లో సామాజిక అవగాహన కల్పించడం,పర్యావరణ పరిరక్షణ,పరిశుభ్రత,ఆరోగ్య అవగాహన,రక్తదానం,గ్రామీణాభివృద్ధి వంటి పలు సేవా కార్యక్రమాల్లో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు చురుకుగా పాల్గొంటున్నారని ఆయన అభినందించారు.ఎన్.ఎస్.ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న వాలంటీర్లకు ప్రత్యేక బ్యాడ్జిలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు సమాజ సేవ పట్ల తమ బాధ్యతను మరింతగా పెంపొందించుకుని,ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి ఏ.ఎన్.ఓ కెప్టెన్ నవీన్ కుమార్,ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.రాజేష్,అధ్యాపకులు,సిబ్బంది మరియు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.






# శ్రీ రాములస్వామి ఆలయానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న

### ముక్కా వరలక్ష్మమ్మ, కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు

పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:

పుల్లంపేట మండలం టీ.కమ్మపల్లి పంచాయతీ పరిధిలోని ఎగవరెడ్డిపల్లె అరుంధతివాడలో నూతనంగా నిర్మించనున్న శ్రీ రాములస్వామి వారి ఆలయానికి శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి శ్రీమతి ముక్కా వరలక్ష్మమ్మ, పుల్లంపేట మండల టీడీపీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల చిరకాల ఆధ్యాత్మిక ఆకాంక్ష నెరవేరేలా ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ముక్కా వరలక్ష్మమ్మ పేర్కొన్నారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని ఆమె అన్నారు. ప్రజల అవసరాలు, విశ్వాసాలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్డిపాక వెంకటసుబ్బయ్య, వెంకటయ్య (రిటైర్డ్ ఉపాధ్యాయుడు), రామకృష్ణయ్య, కూటమి నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రయ్య నాయుడు, స్థానిక ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సమిష్టి కృషితో మదనపల్లి రెడ్డి సంక్షేమ సంఘాన్ని అభివృద్ధి చేద్దాం

### - సర్వసభ్య సమావేశంలో తీర్మానం





మదనపల్లె (ప్రజా సీమ) :

బెంగళూరు రోడ్డులోని రెడ్డి సంఘం భవనం నందు సెక్రటరీ డాక్టర్ ఐ.అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన గురువారం రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగినది.ఈ సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి పనులు,అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఆర్సీడీఎస్ వారు నిర్వహిస్తున్న హాస్టల్ పురోగతి తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మదనపల్లి రెడ్డి సంఘం బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.నిరుపేద రెడ్ల అభ్యున్నతికి రెడ్డి సంక్షేమ సంఘం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఇందులో భాగంగా డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు రెడ్డి కార్యవర్గ సభ్యుల సమక్షంలో అట్టహాసంగా జరిగాయి.రెడ్డి సంక్షేమ సంఘానికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు.రెడ్డి సంక్షేమ సంఘం బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న అనిల్ కుమార్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు రామచంద్రారెడ్డి,అధ్యక్షులు గుడిబండ రవి కుమార్ రెడ్డి,ట్రెజరర్ గిరిధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వి.సాంబశివారెడ్డి,న్యాయ సలహాదారులు శేషారెడ్డి,జాయింట్ సెక్రెటరీ కే.సుధాకర్ రెడ్డి,జై చంద్రా రెడ్డి,తట్టి శ్రీనివాస రెడ్డి,కరుణాకర్ రెడ్డి,కోఆర్డినేటర్ ఎన్.సాంబశివరెడ్డి,కమిటీ సభ్యులు మాధవరెడ్డి,ఆవుల సోమశేఖర్ రెడ్డి,మల్లికార్జున రెడ్డి,రంగారెడ్డి,ఆర్టీసీ రామలింగారెడ్డి,సి.భాస్కర్ రెడ్డి,శేషాద్రి రెడ్డి,భాస్కర్ రెడ్డి,డిష్ చంద్రా రెడ్డి,వేణు గోపాల్ రెడ్డి,మస్తాన్ రెడ్డి,సుబ్బారెడ్డి, సీడ్స్ రామకృష్ణారెడ్డి మరియు ఆర్సీడీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పద్మ ప్రియా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 2న మదనపల్లెకి సీఎం చంద్రబాబు రాక

### - నిర్మలా సీతారామన్‌తో కలిసి హార్టికల్చర్ హబ్ ప్రారంభం

### - జయప్రదం చేయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపు

మదనపల్లె (ప్రజా సీమ) :

గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మదనపల్లెలో పర్యటించనున్నారని ఎమ్మెల్యే ఎం.షాజహాన్ భాష తెలిపారు.కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి హార్టికల్చర్ హబ్‌ను ప్రారంభించనున్నారని చెప్పారు. ప్రపంచస్థాయిలో రాయలసీమకు తలమానికంగా నిలిచేలా ఈ హబ్ ఏర్పాటవుతోందని పేర్కొన్నారు.ఇటీవల కుప్పం పర్యటన సందర్భంగా మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.27 కోట్లు కేటాయించారని,సాధారణ నిధులతో మరో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.గత పదేళ్ల వైసీపీ పాలనలో మదనపల్లె అభివృద్ధికి నోచుకోలేదని, అక్రమాలు ,దౌర్జన్యాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో మదనపల్లె ప్రాంత ప్రజలకు తాగునీరు అందించేందుకు హంద్రీ-నీవా జలాలను తీసుకువచ్చే చర్యలు చేపట్టామని చెప్పారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహుమతిగా అందించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు తలారి రాధమ్మ,మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మి,బాబు నాయుడు,రాటకొండ శ్రీనివాసులు నాయుడు,సోమశేఖర్ నాయుడు,నవీన్ చౌదరి,చిప్పిలి గురునాథ్ యాదవ్,జేవి రమణ,రాయచోటి శశి కుమార్,క్లస్టర్ ఇంచార్జ్ రాజకుమార్,ఐదవ వార్డు ఇంచార్జ్ కొప్పల హరినాథ్,క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు జాన్ బాబు,మంగళ ప్రభాకర్,నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు భారతీ నాయుడు,కప్పల శ్రీరాములు,ఇక్బాల్, రామిశెట్టి కృష్ణ (కమలామ్రి),జయరాం యాదవ్,మస్తాన్ వలి,వినోద్ పసుపులేటి,రెడ్డి రాయల్,రమేష్ రెడ్డి, ఫింర్దోస్, మంజునాథ్,విజయమ్మ,పెద్దసంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.



# వైభవంగా పార్థివ గణపతి నిమజ్జనం!

పుంగనూరు ప్రజాసీమ :

పట్టణంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీ పార్థివ గణపతి నిమజ్జన కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి శోభాయాత్రను ప్రారంభించారు. హైస్కూల్ వీధి, బ్రాహ్మణ వీధి మీదుగా హనుమంతరాయ దేవాలయం వరకు శోభాయాత్ర సాగింది. డప్పుల వాయిద్యాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు వైభవంగా కొనసాగింది, ఈ సందర్భంగా శ్రీ వారాహి టీం యువత మాట్లాడుతూ ఆరేళ్లుగా పార్థివ గణపతిని ప్రతిష్ఠించి విశేష పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాహుల్, రెడ్డి ప్రీతం, అభివర్షిత్ రెడ్డి, పురుషోత్తం, ఈశ్వర్, రెడ్డి రేఖ, దివ్య, రోహిత్, తరుణ్, కార్తీక్ సాయి, ముబారక్, వికాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# మదనపల్లెకి విచ్చేసిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

- ఘనస్వాగతం పలికిన టిడిపి నేత ఆర్.జె.వెంకటేష్

మదనపల్లె (ప్రజా సీమ) :

అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెకు గురువారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి విచ్చేశారు.ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఆర్.జె వెంకటేష్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఇందులో భాగంగా ఇరువురు త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై కాసేపు చర్చించుకున్నారు.ఈ సందర్భంగా ఆర్.జె వెంకటేష్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాల రాజకీయాలలో నల్లారి కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు.పీలేరు నియోజకవర్గాన్ని నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి గణనీయమైన అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు.రాజకీయంగా ఆయన తనకు మంచి సన్నిహితుడని పేర్కొన్నారు.నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి,మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషాలు అత్యంత ప్రజాదరణ కలిగిన నేతలని కొనియాడారు.త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అన్నిస్థానాల్లో గెలిపించుకొని ముఖ్యమంత్రికి బహుమతిగా ఇద్దామని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,తెలుగు యువత నాయకులు గండికోట గణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి పార్టీలో చేరిన నక్క బండ లోని 25 కుటుంబాలు!

పుంగనూరు ప్రజా సీమ :

పట్టణంలోని పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గ ఇంచార్జ్ మధుసూదన్ నాయుడు ఆధ్వర్యంలో గురువారం నక్కబండకు చెందిన 25 కుటుంబాలు కు చెందిన యువత టిడిపి కండువా కప్పుకుని పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రాజా, రెడ్డప్ప, సన్ని, దుర్గాప్రసాద్, కార్తిక్, యశ్వంత్, శ్రీనివాసులు, ఉమాపతి, తేజ, విజయ్, సాయి, పవన్, చందు, బాలూ, ప్రభాస్, మహేశ్, సురేష్, లోకేశ్, రూపేష్, పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా మధుసూదన్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.




# కమ్మ పాలెంలో గణపయ్యను దర్శించుకున్న చైర్మన్ దంపతులు

దారపునేని దశరథ రామానాయుడు (దశ )

సిద్ధవటం ప్రజా సీమ

సిద్ధవటం మండలం కమ్మ పాలెం గ్రామపంచాయతీ కమ్మ పాలెం గ్రామంలో వినాయక మండపం వద్ద సిద్ధవటం సింగల్ విండో చైర్మన్ దంపతులు వినాయకుని దర్శించుకోవడం జరిగిందని సింగల్ విండో చైర్మన్ దారపునేని దశరథ రామానాయుడు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా వినాయక చవితి వేడుకలు కమ్మ పాలెం గ్రామంలో ఘనంగా జరుగుతాయని వారన్నారు ఆ వినాయకుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని సకాలంలో వర్షాలు పడి రైతుల సుఖ సంతోషాలతో ఉండాలని వారన్నారు కార్యక్రమంలో దశరథ రామానాయుడు (దశ )సభ్యులు పాల్గొన్నారు



# వర్షాల వేళ పంటల పరిస్థితిపై జేసీ ఇలక్కియ పరిశీలన

ప్రజా సీమ

జగ్గయ్యపేట నియోజకవర్గ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో మాట్లాడిన జాయింట్ కలెక్టర్ పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పత్తి తదితర పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సూచనలు సలహాలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు ఆమె వత్సవాయి మండలం మక్కపేట గ్రామంలో పర్యటించి పత్తి పంటలను పరిశీలించారు వర్షాల కారణంగా పంటలపై పడుతున్న ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు పంటల పరిస్థితిపై వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు వర్షాల కారణంగా పంటలకు ఏదైనా నష్టం సంభవించినట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేయాలని రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు పొలాల్లో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి నీటి పారుదలకు అవసరమైన చర్యలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు అనంతరం జాయింట్ కలెక్టర్ లింగాల వంతెనను పరిశీలించి అక్కడి పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు భారీ వర్షాల నేపథ్యంలో వంతెనలు వాగులు వంకల వద్ద నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు తదుపరి జగ్గయ్యపేట పట్టణంలోని ఊర చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు చెరువులో నీటి నిల్వ నీటి ప్రవాహం పరిసర ప్రాంతాల పరిస్థితిని పరిశీలించారు క్షేత్రస్థాయి పర్యటనలో నందిగామ ఆర్డీవో జి.అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు సమాచార పౌర సంబంధాల శాఖ ఎన్టీఆర్ జిల్లా ద్వారా జారీ



# బర్రెలను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు






మూడు బర్రెలు మృతి

ఒక బర్రెకు త్రీవ గాయాలు

లబోదిబోమంటున్న పాడి రైతు తుర్ర శ్రీనివాసులు

సిద్ధవటం( ప్రజా సీమ )

కడప చెన్నై జాతీయ రహదారి భాకరాపేట సమీపాన గురువారం సాయంత్రం పొద్దుటూరు నుండి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా వచ్చి పాడి పశువులను ఢీ కొట్టడంతో 3పాడే గేదెలు మృతి చెందగా మరో గేదకు త్రీవ గాయాలయ్యాయి మండలంలోని భాకరాపేట గ్రామంలో నివాసం ఉన్న పాడి రైతు, తుర్ర శ్రీనివాసులు బర్రెలను తోలుకొని వస్తుండగా ప్రొద్దుటూరు నుండి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ( ఏపీ 04 జెడ్ 0358) అనే బస్సు గేదలను ఢీ కొట్టి బస్సు ఆపకుండా డ్రైవర్ చాకచక్యంగా పరారయ్యాడు ఈ సందర్భంగా రైతు శ్రీనివాసులు మాట్లాడుతూ మా కుటుంబం అంతా పాడి పశువుల పైనే జీవన ఆధారంగా జీవిస్తున్నామని బస్సు ఢీ కొట్టడం వల్ల3 గేదెలు మృతి చెందగా, మరో గేదె చావు బతుకుల్లో ఉన్నాయని నాలుగు 4 లక్షల రూ, విలువ అవుతుందని,పాడి రైతు తెలిపారు విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి తిరుపతికి వెళుతున్న బస్సును రాజంపేట ఆర్టీసీ బస్టాండ్ లో గుర్తించారు జరిగిన సంఘటనపై మండల ఎస్సై హారిక విచారిస్తున్నారు



# మదనపల్లెలో ఆక్రమణలకు గురవుతున్న కాలువలు,వంకలు

- సర్వేలో రెవెన్యూ శాఖ తీవ్ర నిర్లక్ష్యం
- బీవైఎస్ వ్యవస్థాపకులు పునీత్ కుమార్ ఆరోపణ

మదనపల్లె (ప్రజా సీమ) :

పట్టణంలోని పలు ప్రాంతాల్లో బహుదా కాలువలు,సాగునీటి కాలువలు,చెరువుల వంకలు అక్రమంగా ఆక్రమించడంతోపాటు,వాటిలో వ్యర్థాలను డంపింగ్ చేసి మట్టితో ఫిల్లింగ్ చేస్తున్న ఘటనలు జరుగుతున్నాయని బహుజన యువసేన (బీవైఎస్) రాష్ట్ర అధ్యక్షులు పునీత్ కుమార్ ఆరోపించారు.ఈ సమస్యపై మున్సిపల్ కార్యాలయం మరియు ఇరిగేషన్ శాఖకు ఫిర్యాదులు చేయగా సమస్య పరిష్కారం కోసం మదనపల్లె మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఇరిగేషన్ శాఖకు ఎండార్స్‌మెంట్,అనంతరం ఇరిగేషన్ శాఖ రెవెన్యూ శాఖకు ఎండార్స్‌మెంట్ చేసి,సంబంధిత కాలువలు,సాగునీటి కాలువలు,చెరువుల వంకలను సర్వే చేసి ఎంత మేర ఆక్రమణకు గురయ్యాయో గుర్తించాలని కోరిందన్నారు.అయితే రెవెన్యూ శాఖకు ఎండార్స్‌మెంట్ ఇచ్చి దాదాపు రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు సర్వే నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పునీత్ కుమార్ విమర్శించారు.కాలువలు,వంకలు ఆక్రమణలకు గురికావడం వల్ల హంద్రీ-నీవా నీరు సాగునీటి కాలువలకు,చెరువులకు సక్రమంగా చేరకుండా ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు.తక్షణమే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి,ఆక్రమణల పూర్తి వివరాలను గుర్తించి,సంబంధిత శాఖలు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన డిమాండ్ చేస్తోందని పునీత్ కుమార్ తెలిపారు.



# ఢిల్లీలో ఘనంగా జరిగిన 'పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా' 13వ వార్షిక సదస్సు





- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్
- - ప్రత్యేక అతిథులుగా శ్రీ ప్రమార్

(ప్రజా సీమ) :

దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా గురువాసింది. న్యూఢిల్లీలోని ప్రసిద్ధ తాజ్ మహల్ హోటల్‌లో జరిగిన ఈ జాతీయ స్థాయి సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు హాజరయ్యారు. ఈ వేడుకలో ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న యువనేత నారా లోకేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, దేశ విదేశాల నుంచి విచ్చేసిన ప్రముఖ ప్రతినిధులు ఈ వేదికను పంచుకున్నారు. దేశ ఆర్థికాభివృద్ధి, సాంకేతిక మ సంబంధించి పలు అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది.స్వాగత కార్యక్రమం అనంతరం మంత్రి నారా లోకేష్‌తో పాటు కూటమికి చెందిన పలువురు ఎంపీలు ఒక ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఉన్నత స్థాయి భేటీలో ప్రస్తుతం దేశంలో మరియు రాష్ట్రాలన మహేష్ కుమార్ చురుగ్గా పాల్గొంటూ, రాష్ట్ర స్థాయి నాయకత్వంతో కలిసి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతుండటం పట్ల ఏలూరు నియోజకవర్గ ప్రజలు, తెలుగుదేశం పార్టీ మరియు కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఢిల్లీ వేదికగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చేపట్టిన ఈ పర్యటన ఏలూరు అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రూ.100 కోట్లకు 'మాన్‌స్టర్' థియేట్రికల్ రైట్స్ .. సల్మాన్ ఖాన్ సినిమాకి భారీ బిజినెస్ టాక్

బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్, లేడీ సూపర్‌స్టార్ నయనతార కలిసి నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'మాన్‌స్టర్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా కొనసాగుతోంది. సల్మాన్ ఖాన్, నయనతార కాంబినేషన్‌తో పాటు దర్శకుడు వంశీ పైడిపల్లి, నిర్మాత దిల్ రాజు కలిసి చేస్తున్న సినిమా కావడంతో బాలీవుడ్, దక్షిణాది ప్రేక్షకుల్లోనూ ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి పెరుగుతోంది. ప్రస్తుతం ముంబైలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్న చిత్రబృందం.. అక్టోబర్‌లో విదేశాల్లో మరో షెడ్యూల్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.కథకు కీలకంగా నిలిచే యాక్షన్ సన్నివేశాలతో పాటు విదేశీ లొకేషన్లలో కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్, నయనతార ప్రధాన పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రంలో పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరవింద్ స్వామి, రోనిత్ రాయ్, సీమా బిస్వాస్ తదితరులు ఈ ప్రాజెక్టులో భాగమయ్యారు. దీంతో సినిమాకు బాలీవుడ్ స్థాయిలోనే కాకుండా దక్షిణాది ప్రేక్షకులను ఆకట్టుకునేలా భారీ తారాగణం సిద్ధమవుతోంది. దిల్ రాజు నిర్మాణ సంస్థ నుంచి వస్తున్న ఈ చిత్రం.. ఆయన, సల్మాన్ ఖాన్ కలయికలో తెరకెక్కుతున్న తొలి సినిమా కావడం కూడా ప్రత్యేకతగా మారింది. వంశీ పైడిపల్లి గతంలో భారీ స్థాయి చిత్రాలను తెరకెక్కించిన అనుభవం ఉండటంతో ఈ ప్రాజెక్టును కూడా అత్యంత భారీగా రూపొందిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇక 'మాన్‌స్టర్' సినిమాకు సంబంధించిన బిజినెస్ వ్యవహారాలపై తాజాగా ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా దేశవ్యాప్త థియేట్రికల్ హక్కులను ప్రముఖ మల్టీప్లెక్స్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ సుమారు రూ.100 కోట్లకు దక్కించుకున్నట్లు సినీ వ్యాపార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ఒప్పందం రిఫండబుల్ అడ్వాన్స్ విధానంలో కుదిరినట్లు కూడా సమాచారం. అంటే సినిమా విడుదలకు ముందే భారీ మొత్తంలో బిజినెస్ జరగడం ద్వారా ప్రాజెక్టుపై ఉన్న మార్కెట్ అంచనాలు ఎంత స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ రూ.100 కోట్ల ఒప్పందానికి సంబంధించి నిర్మాత దిల్ రాజు, చిత్రబృందం లేదా పీవీఆర్ ఐనాక్స్ సంస్థ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ప్రస్తుతం వినిపిస్తున్న ఈ బిజినెస్ వార్తను అధికారికంగా నిర్ధారించబడిన విషయంగా కాకుండా పరిశ్రమ వర్గాల్లో జరుగుతున్న ప్రచారంగానే చూడాలి. 'మాన్‌స్టర్'ను 2027 ఈద్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.





# రూ.2,490 కోట్లు తగ్గిన షారుఖ్ ఖాన్ సంపద.. అసలు కారణం ఇదే!

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ఆస్తికి సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దేశంలోని ధనవంతుల జాబితాను రూపొందించే 'హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' తాజాగా ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే షారుఖ్ ఖాన్ ఆస్తి కాస్త తగ్గింది. గతేడాది ఆయన ఆస్తి విలువ రూ. 12,490 కోట్లుగా ఉండగా, ఈ ఏడాది అది రూ. 2,490 కోట్లు తగ్గి రూ. 10,000 కోట్లకు చేరింది. ఆయన వ్యాపారాలు, నిర్మాణ సంస్థ 'రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్', ఐపీఎల్ టీమ్ 'కోల్‌కత్తా నైట్ రైడర్స్' వంటి వాటిని లెక్కలోకి తీసుకుని ఈ అంచనా వేశారు. ఆస్తి కొంత తగ్గినా సరే, భారతదేశంలో అత్యధిక ఆస్తులున్న నటుడిగా షారుఖ్ ఖాన్ మాత్రం తన నెంబర్ వన్ స్థానాన్ని పదిలంగా కాపాడుకున్నారు. ఈ జాబితాలో అమితాబ్ బచ్చన్ రూ. 4,000 కోట్లతో రెండో స్థానంలో ఉండగా, సల్మాన్ ఖాన్ (రూ. 3,000 కోట్లు), హృతిక్ రోషన్ (రూ. 2,500 కోట్లు) తర్వాతి స్థానాల్లో నిలిచారు.మరోవైపు సినిమాల విషయంలో షారుఖ్ జోరు ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఆయన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ సినిమా 'కింగ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది





# 'జార్జ్‌క్రిష్'లో మానస

''దేవకి నందన వాసుదేవ' చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది హైదరాబాద్ సొగసరి మానస వారణాసి. 'కపుల్‌ఫ్రెండ్లీ' సినిమా ద్వారా యువతరానికి చేరువైంది. తాజాగా ఈ భామ తెలుగులో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. శర్వానంద్ నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'జార్జ్‌క్రిష్'లో ఆమెను కథానాయికగా ఖరారు చేశారు.భాషా కోర్సులు నేర్చుకోండి శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. కథాగమనంలో మానస వారణాసి పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, శర్వానంద్‌తో ఆమె ప్రేమాయణం ఆద్యంతం ఆసక్తిగా సాగుతుందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. సంక్రాంతికి విడుదలకానుంది

# 'ఆ రోజు నాకు రెండో జీవితం దక్కింది'..

## ఐదేళ్ల క్రితం ప్రమాదాన్ని గుర్తుచేసుకున్న సాయి దుర్గా తేజ్



మెగా హీరో సాయి దుర్గా తేజ్ జీవితంలో 2021 సెప్టెంబర్ నెలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన.. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండి చికిత్స తీసుకున్నారు. ప్రమాదం నుంచి క్రమంగా కోలుకుని మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. ఇప్పుడు ఆ ప్రమాదం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సాయి దుర్గా తేజ్ చేసిన భావోద్వేగ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐదేళ్ల క్రితం ఇదే రోజున తనకు జీవితంలో రెండో అవకాశం లభించిందని సాయి దుర్గా తేజ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు అందించిన అండ తన కోలుకునే ప్రయాణంలో ఎంతో కీలకంగా నిలిచిందని చెప్పారు. వారి ప్రేమ, ప్రార్థనలు, సందేశాలు తనకు కష్టమైన రోజుల్లో ముందుకు సాగేందుకు బలాన్ని ఇచ్చాయని గుర్తుచేసుకున్నారు.ప్రమాదంలో ఎదురైన గాయాల నుంచి తాను దాదాపు 90 శాతం వరకు కోలుకున్నానని సాయి దుర్గా తేజ్ తెలిపారు. అయితే మాటతీరు సహా కొన్ని విషయాల్లో ఇంకా పూర్తిగా మెరుగుపడేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రతిరోజూ ఒక్కో అడుగు ముందుకు వేస్తూ కోలుకుంటున్నానని పేర్కొన్నారు. కష్టమైన ప్రతి రోజు, ఎదురుదెబ్బ తగిలిన ప్రతి సందర్భం, వదిలేయడం సులభంగా అనిపించిన ప్రతి క్షణంలోనూ మీ ప్రేమే నాకు బలాన్ని ఇచ్చింది. ఐదేళ్ల తర్వాత కూడా నేను నిలబడి ఉన్నాను. పోరాడుతున్నాను. జీవిస్తున్నాను అనే భావాన్ని ఆయన తన పోస్ట్‌లో వ్యక్తం చేశారు. తన కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ, పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పినవారికి, ప్రతి సందేశం ద్వారా ప్రేమను పంచుకున్నవారికి సాయి దుర్గా తేజ్ కృతజ్ఞతలు తెలిపారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి అభిమానుల ప్రేమ కూడా ఒక ముఖ్యమైన కారణమని చెప్పారు.తన ప్రమాదం నుంచి అందరూ ఒక విషయాన్ని నేర్చుకోవాలని సాయి దుర్గా తేజ్ సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్ ధరించడం చిన్న నిర్ణయంలా కనిపించినా.. ప్రాణాలను కాపాడటంలో అది ఎంతో కీలకమని తన అనుభవం ద్వారా చెప్పారు.ప్రమాదం తర్వాత సాయి దుర్గా తేజ్ మళ్లీ సినిమాల్లోకి రావడం కూడా అభిమానుల్లో ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగించింది. ఇప్పుడు ఆయన వరుసగా సినిమాలు చేస్తూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఇక సాయి దుర్గా తేజ్ నటిస్తున్న తాజా

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma